## క్లుప్తంగా

### నేడు చివరి అవకాశం

శ్రీరంగరాజపురం: బడుగు, బలహీన మధ్యతరగతి వర్గాలకు చెందిన పేదవారు తమ గ్రామ సమీపానికి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యను అభ్యసించడానికి సోమవారం చివరి రోజు అని ఆసక్తి గల అభ్యర్థులు www.cse.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ అరుణాచలం రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేదవారికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ అవకాశం ఒకటో తరగతికి వెళ్లే విద్యార్థులకు మాత్రమే అని అన్నారు. ఇందులో సీటు పొందిన విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు పూర్తిగా ఉచితవిద్యను అభ్యసించవచ్చన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందుతాయన్నారు.

### కనిపించే దేవత అమ్మ


అమ్మ గొప్పతనాన్ని వర్ణిస్తున్న పర్వేజ్


కార్వేటినగరం: కనిపించే దేవత అమ్మ అని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు పర్వేజ్ అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. నవమాసాలు మోసి మనల్ని కన్న తల్లి మనకు ప్రత్యక్షంగా కనిపించే దేవత అని కొనియాడారు. అనంతరం గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ బిడ్డల ఎదుగుదలకు తల్లి పడే ఆరాటం అంతాఇంతా కాదని, అలాంటి తల్లిని బిడ్డలు ఎంతో ఆప్యాయంగా చూసుకోవాలని సూచించారు. తల్లిని ప్రేమించిన పిల్లలు ఎంతో సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. అనంతర విద్యార్థులకు పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు.

### రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వడమాలపేట: రాష్ట్రస్థాయి అండర్–19 జూడో పోటీలకు వడమాలపేట బాలుర పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్‌ఎం భువనేశ్వరి తెలిపారు. ఆదివారం తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 జూడో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉదయ్‌కుమార్ (73), యశ్వంతి (70), లతాశ్రీ (52), రాగదీపిక(44), భవిత(36) కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు మే 18, 19 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో జరిగే రాష్ట్రస్థాయి అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అండర్–19 క్రీడా సమాఖ్య కార్యదర్శి జయరామయ్య, చీఫ్ కోచ్ సయ్యద్, జూడో కోచ్ గోపి, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రాజు, జూడో సంఘం కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

### వరసిద్ధునికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత సాయినగేష్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.లక్ష విరాళం అందింది. ఆదివారం సాయంత్రం గుంటూరుకు చెందిన సాయినగేష్ కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి నిత్య అన్నదానంకు రూ.లక్ష విరాళం అందించారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### వీరాంజనేయ స్వామికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం శ్రీ వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు సమర్పించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ ఈఓ, అధికారులు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారి పట్టు వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అధికారులకు, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.




ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి, ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి, ఆలయంలో ఆంజనేయ స్వామి దీపాలంకరణ

# వాయుపుత్ర హనుమా..

- ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు


నగరి: ఆలయం వద్ద భక్తుల సందడి


నగరి: పూజల్లో పాల్గొన్న మహిళలు


నగరి: అన్నదానానికి తరలివచ్చిన జనం

నగరి: మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలో హనుమాన్ చాలీసా పఠించారు. హోమపూజలు నిర్వహించి సీతారామ కల్యాణం చేయగా భక్తులు పాల్గొన్నారు. రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పరిధిలో ఊరేగించారు. ఆలయం ముందు దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంది. గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర ఆలయంలో, కీళపట్టు ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో, కరియమాణిక్యస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి.

**పుత్తూరులో..**

పుత్తూరు రూరల్: పట్టణంలోని స్వర్ణ లేఅవుట్‌లో ఆదివారం హనుమ జయంతిని ఘనంగా నిర్వహించారు. 25 అడుగుల ఎత్తగల విగ్రహం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించి, అర్చనలు, హారతులు ఇచ్చారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 400 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు నాగభూషణం, బాలిరెడ్డి, హేమచంద్రారెడ్డి, కేశవ, మాధవరాజు, వినోద్, వేములు, జయరామిరెడ్డి, గౌరీశంకర్, భాస్కర్ తదితరులు పర్యవేక్షించారు.

**వెదురుకుప్పంలో..**

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అర్చకులు స్వామివారికి పాలాభిషేకం చేశారు. పట్టు పీతాంబరాలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**శ్రీరంగరాజపురంలో..**

శ్రీరంగరాజపురం: మండలంలోని సింధూరాజపురం గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు.

## కనుల పండువగా ద్రౌపదీదేవి కల్యాణం


ద్రౌపదీ, ధర్మరాజుల స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండలంలోని గరగలపల్లి వెంకటాపురంలో వెలసి ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అదేవిధంగా అమ్మవారి పుట్టినిల్లుగా భావించే పాత వెంకటాపురం గ్రామం నుంచి అమ్మవారికి వడిబాల కట్టి భీమ, అర్జున, నకుల, సహదే, ఉత్సవమూర్తులతో పాటు శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలతో అమ్మవారి శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి కనుల పండువగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలను అందించారు.

### గంగమ్మకు సారె సమర్పణ

తిరుమల: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం తిరుమల మీడియా ప్రతినిధులు అమ్మవారికి సారె సమర్పించారు. కళాబృందాలు వెంటరాగా మధురానగర్ నుంచి ఊరేగింపుగా వచ్చిన మీడియా ప్రతినిధులకు ఆలయం వద్ద ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సూరా మోహన్ ప్రసాద్, లక్ష్మీకాంత్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, చిన్నంగారి మురళి, శ్రావణ్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

### పొన్నియమ్మ ఆలయం కిటకిట

చిత్తూరు రూరల్: గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ పొన్నిమయ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆలయ ఆవరణంలో పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో తరించారు. వీరి రాకతో ఆలయం కిక్కిరిసింది. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ప్రతి ఒక్కరికీ సేవాభావం ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఓపీని పర్యవేక్షిస్తున్న చెంగల్రాజు

- రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, నేటి సమాజంలో ఇది అత్యంత అవసరమైన మానవీయ కోణమని రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్‌లో స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవాసంస్థ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు కనుమరుగు అవుతున్న నేపథ్యంలో స్వయంకృషి వంటి సంస్థలు ఇంకా సేవాదృక్పథంతో పనిచేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేకించి రాచపాళెం గ్రామంలో విద్యాభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. కంటి వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్స నిర్వహించి, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమన్నారు. పేదలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 200 మందికి పరీక్షలు నిర్వహించి 35 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరిని తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రికి తరలించి, శస్త్ర చికిత్స ఏర్పాట్లు చేశారు. వైద్య శిబిరంలో స్థానిక స్కౌట్ అండ్ గైడ్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు సేవలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, స్వయంకృషి సంస్థ ప్రధాన కార్యదర్శి బి.చెంగల్రాజు, కోశాధికారి విజయకుమార్, సంస్థ సభ్యులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, అరుణాచలంరెడ్డి, వర్మ, మునికృష్ణయ్య, వెంకటకృష్ణ, మునిరత్నంఆచారి, పాఠశాల హెచ్‌ఎం సుబ్రమణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

### గడ్డివాము దగ్ధం



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం దోర్నకంబాలలో ఆదివారం మధ్యాహ్నం గడ్డివాము కాలిపోయింది. చెంచు అనే వ్యక్తి పశువుల మేత కోసం గ్రామ శివారులో గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం ఉన్నట్లుండి గడ్డివాములో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వీలు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తిరుపతి నుంచి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. చంద్రగిరి మండలం శానంబట్లలో జరుగుతున్న మిస్టరీ మంటల నేపథ్యంలో దోర్నకంబాలలో అదే తరహాలో మంటలు చెలరేగడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అర్చకుల ఓవరాక్షన్.. భక్తుల పరేషాన్..

- ఆలయంలో టెంకాయ కొట్టరు.. అర్చన చేయరు
- కనీసం ప్రసాదం కూడా స్వామివారి పాదాల దగ్గర పెట్టనీయరు
- భక్తాంజనేయ ఆలయంలో అర్చకుల అత్యుత్సాహం
- హనుమజ్జయంతి నాడు భక్తులకు చేదు అనుభవం




సాయంత్రం 5 అవుతున్నా భక్తులు రాక బోసిపోయిన ఆలయం, ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన బోర్డు

పుత్తూరు రూరల్: స్వామివారి దర్శనానికి వస్తే అర్చకుల అత్యుత్సాహం కారణంగా భక్తుల మనసు గాయపడింది. ఆదివారం పుత్తూరు పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి నాడు భక్తులకు చేదు అనుభవం ఎదురైంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు 'రాముడి కష్టాలనే తీర్చిన హనుమా.. నీ దర్శనానికి వస్తే మమ్మల్ని ఈ అర్చకులు ఎందుకు ఇలా బాధ పెడుతున్నారా..నువ్వు అయినా మా మొర ఆలకింపు హనుమా' అని వేడుకున్నారు. అంటే అక్కడి అర్చకుల వ్యవహార శైలి ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఉదయం 11 గంటల సమయంలో స్వామివారి మూల విరాట్ వద్ద నలుగురు అంటే నలుగురు భక్తులే ఉన్నారు. అందులో ఒకతను అర్చకుడి చేతికి ఓ సంచి ఇస్తూ అర్చన చేయాలని కోరగా అర్చన కుదరదు అన్నాడు.. ఆపై టెంకాయ కూడా మీరే బయట కొట్టుకోండి అంటూ ఓ అర్చకుడు హుకూం జారీ చేశాడు. దీంతో చేసేదేమీ లేక ఆ భక్తుడు బాధపడుతూనే వెనుదిరిగాడు. మరో భక్తుడు ప్రసాదాన్ని స్వామివారి పాదాల వద్ద పెట్టి ఇవ్వండి అని అడిగాడు. అందుకు మరో అర్చకుడు 'ప్రసాదం కూడా మీరే బయట పంచేసుకోండి' అని కసురుకున్నాడు. దీంతో ఆలయ అర్చకులు ఎందుకు ఇలా చేస్తున్నారు అని పలువురు భక్తులు మదనపడ్డారు. పోనీ ఆలయం భక్తులతో కిటకిటలాడుతోందా? అంటే అదీ లేదు. కనీసం పట్టుమని పది మంది భక్తులు లేరు. మరెందుకు అర్చకుల ఓవరాక్షన్ అని భక్తులు ప్రశ్నించారు. నలుగురు భక్తులు వస్తే అర్చన చేయలేని ఆలయంలో ముగ్గురు అర్చకులు ఎందుకు ఉన్నట్లు? ఓ అర్చకుడు మాత్రం తనకు నచ్చిన వారిని గర్భగుడి లోపలికి తీసుకెళ్లి సకల మర్యాదలు చేసి పంపడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విరాళాలు ఇస్తే స్వామివారి కృప..**

భక్తులు మీకు తోచిన విరాళాలు సమర్పించి స్వామి వారి కృప పొందాలని ఆశిస్తూ అంటూ ఆలయ కమిటీ ఆలయం వెలుపల ఓ బోర్డు పెట్టింది. పాపం ఈ బోర్డు చూడకుండా లోపలికి వెళ్లిన వారికి పైన చెప్పిన పాట్లు ఎదురయ్యాయి. సాయంత్రం 5 గంటలు అవుతున్నా భక్తులెవరూ ఆ ఆలయం వైపు తొంగి చూడలేదు. అంటే ఆలయ అర్చకుల వ్యవహార శైలి ఎలా ఉందో ఇట్టే తెలుస్తోంది.

## యోగాతో మెరుగైన ఆరోగ్యం


కాయం గ్రామంలో యోగా కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి రోజా

- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా


మాట్లాడుతున్న మంత్రి రోజా

వడమాలపేట: యోగా ఆరోగ్యానికి చాలా మంచిదని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ప్రతి రోజు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాయం గ్రామంలో ది వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్–విలేజ్ సర్వీస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాసనాలు మానవ శరీరంలో అవయవాలకు మంచి ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం, విద్యాభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, వయోవృద్ధుల పరిరక్షణకు, మహిళా సంరక్షణ కోసం చాలా అవసరమన్నారు. సౌత్ ఇండియా ఫిలిం అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి మాట్లాడుతూ కుటుంబ శాంతి, ధర్మబద్ధమైన జీవనం, మానవలక్ష్యం, మత సామరస్యానికి ఈ ధ్యానం చాలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, కాణిపాకం బోర్డు మెంబర్ ప్రతిమ, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ కరుణాకర్ చౌదరి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా బీసీ కార్యదర్శి సదాశివయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి ఉమాపతి, సదాశికోన బోర్డు మెంబర్ కమల, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కిరణ్ సర్పంచులు మంజుల, శ్రీవిద్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరిమాను గంగమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయానికి బొమ్మలు తీసుకొస్తున్న భక్తులు


అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ పావులూరు కండ్రిగ గ్రామంలో వెలసిన ఆరిమాను గంగమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ట చేశారు. ఉదయం అమ్మవారి ఆలయం ఎదుట వేదపండితులచే యాగశాలలో హోమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఉభయదారులు చెంచునాయుడు అమ్మవారి ఆలయానికి పూజసామగ్రిని అందజేశారు. అమ్మవారిని ఊరేగింపునకు వినియోగించే గుర్రం, ఏనుగు తదితర బొమ్మలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేర్చారు. వేదపండితులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఎదుట ఉంచారు. సాయంత్రం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## యోగాతో మానసిక ప్రశాంతత


యోగా శిక్షణ అందిస్తున్న యోగా గురువు

నగరి: మనసును అదుపులో ఉంచుకోవడమే యోగా అని, మానసిక ప్రశాంతత పొందడానికి యోగా ఎంతో సహకరిస్తుందని యోగా గురువు పుల్లయ్య గురూజీ తెలిపారు. ఆదివారం నగరి పట్టణంలోని శేషాచల వెంకటసుబ్బయ్య డిగ్రీకళాశాల ఆవరణలో చిన్నారులకు యోగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. చిన్నారులకు యోగా శిక్షణ చేపట్టే విధానాలపై అవగాహన కల్పించడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగా, ధ్యానం నేర్చుకోవడం ద్వారా మేధాశక్తిని పెంచుకోవడంతో పాటు, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో యోగా రీసోర్స్ పర్సన్లు బాబు, ఎల్లప్పరెడ్డి, అయ్యప్పన్, హరిహరన్, మీనాక్షిసుందరం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మర్చిపోలేని జ్ఞాపకం.. అపూర్వ సమ్మేళనం


గురువులతో కలసి పూర్వ విద్యార్థులు

- నాడు గురువులంటే భయం
- 34 ఏళ్ల తరువాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది
- బలిజకండ్రిగ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల భేటీ

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే స్కూల్లో కలుసుకున్నారు. దాదాపు 34 ఏళ్ల తరువాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన స్నేహితులు, తమకు విద్యను బోధించిన గురువులను నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్య నేర్పించిన గురువులు మార్కొండనాయుడు, గోవిందప్ప నాయుడికి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు వేదికపై నుంచి వారి ప్రస్తుతం వారి వృత్తిపరమైన అంశాలను తోటి మిత్రులతో పంచుకున్నారు. తాము చదువుకునే రోజుల్లో స్కూల్లో గణిత ఉపాధ్యాయుడు మార్కొండనాయుడు అంటేనే భయపడేవాడినని పూర్వ విద్యార్థి ధనరాజ్ తెలిపారు. ఆయనకు కోపం వస్తే ఎలా కొడతాడో అనే భయంతోనే చదివేవారమన్నారు. అలా చదువుకున్నందునే తమ బ్యాచ్‌లో చాలామంది ఉపాధ్యాయులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డామని కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు మాట్లాడుతూ 1989–90 సంవత్సరంలో తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఇలా కలవడం చాలా ఆనందంగా ఉన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంతో పాటు సమాజ సేవ చేసినప్పుడే గురువులకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు. తమకు విద్యను నేర్పించిన ఇద్దరు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఐదుగురు మృతిచెందారు. వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు లింగమూర్తి, మునిరత్నం నాయుడు, టీచర్లు దొరస్వామి, రమేష్ నాయుడు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇదో మధురానుభూతి..**



ఉద్యోగ నిమిత్తం తిరుత్తణిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. చిన్ననాటి స్నేహితులను, ఉన్నతస్థాయికి ఎదగడానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం. ఇంతమంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్నేహితులకు ధన్యవాదాలు. చాలామంది జీవితంలో స్థిరపడ్డాం. – ఎస్.గోవిదంరాజు, పూర్వ విద్యార్థి

**మాటల్లో చెప్పలేని ఆనందం**



బలిజకండ్రిగ హైస్కూల్‌లో చదువు పూర్తయి 34 ఏళ్ల తరువాత అప్పటి మిత్రులను కలుసకోవడం సంతోషంగా ఉంది. నేను పాలసముద్రం ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొందరం స్థానికంగానే ఉన్నా, ఉద్యోగరీత్యా వేర్వేరు చోట పని చేస్తున్నారు. ఇంత కాలానికి అంతా కలసి సహపంక్తి భోజనాలు చేయడం మధురానుభూతి. –ధనరాజ్, పూర్వ విద్యార్థి

**మా గురువులను కలవడం సంతోషం**



నేను చెన్నైలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నాను. నా భర్తతో కలసి మా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వచ్చాను. గతంలో విద్య నేర్పిన గురువులను చూసినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఉపాధ్యాయురాలిగా అవడానికి కారణం మా గురువులే. ఇన్నేళ్ల తరువాత మా గురువులు, నాతో పాటు చదివిన స్నేహితులను కలుసుకోవడం మధురానుభూతిని మిగిల్చింది. –పద్మజ, టీచర్